# గ్రూప్-1 మెయిన్స్ పేపర్-3 విభాగం-1 విశ్లేషణ..

**సుస్థిర వృద్ధి ప్రక్రియలో ఉత్పాదక రంగాలకు పరపతి విషయంలో బ్యాంకింగ్ రంగం ప్రధాన పాత్ర వహిస్తుంది. బ్యాంకులు అందించే పరపతి సౌకర్యాల మీదే వాటి సమర్థత ఆధారపడి ఉంటుంది. మార్చి 31, 2008 నాటికి అన్ని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల మొత్తం ఆస్తులు గతేడాదితో పోల్చినపుడు రూ. 4.33 మిలియన్లకు పెరిగాయి. పరపతి - డిపాజిట్ నిష్పత్తి 2009 మార్చి నాటికి 72.3 శాతంగా నిలిచింది. రికవరీ కాని రుణాలు మొత్తం షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల మొత్తం ఆస్తుల్లో 1.3 శాతానికి తగ్గాయి. పబ్లిక్, ప్రైవేటు, విదేశీ బ్యాంకులు ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చే రుణలక్ష్యాలను చేరుకున్నాయి. 2008 చివర్లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం భారత బ్యాంకింగ్ రంగంపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. దీనికి కారణం బ్యాంకింగ్ రంగంపై మనం అవలంభించిన నియంత్రణ విధానమే. దీంతో పాటు గతంలో భారత ఆర్థిక వ్యవస్థ సాధించిన వృద్ధి, తక్కువ డిఫాల్టర్ నిష్పత్తి, క్లిష్టతరమైన ఫైనాన్షియల్ ప్రాడక్ట్స్ లేకపోవడం కూడా కారణాలుగా పేర్కొనవచ్చు. ప్రస్తుతం ఆర్థికవృద్ధి మందగించిన నేపథ్యంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్యవిధానం ఆర్థికాభివృద్ధిలో ప్రధానపాత్ర వహిస్తుంది.**

### పేపర్ 3 - 4వ చాప్టర్ సిలబస్:

ద్రవ్యవిధానం – భారతీయ బ్యాంకింగ్ స్వరూపం:
ద్రవ్య విధానం – భారతీయ బ్యాంకింగ్ స్వరూపం, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, 1990 నుంచి వాటిలో సంస్కరణలు – ఆర్‌బీఐ పరపతి క్రమబద్ధీకరణ.

### ఎక్స్‌పెక్టెడ్ ప్రశ్నలు:

**1. ప్రాధాన్యతారంగాభివృద్ధిలో బ్యాంకింగ్ రంగ పాత్ర?**

జ. 1969లో వాణిజ్య బ్యాంకుల జాతీయికరణకు ప్రాధ్యాన్య తారంగ పరపతి ఒక కారణంగా పేర్కొనవచ్చు. ప్రాధాన్య తారంగ రుణాలు, 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంపై ఏర్పా టైన వర్కింగ్




గ్రూప్‌నకు నేతృత్వం వహించిన డాక్టర్.కె.ఎస్.కృష్ణస్వామి అభిప్రాయంలో.. జాతీయ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర వహిస్తున్న రంగాలకు కావాల్సినంత పరపతి లభించడంలేదు. 1980లో బ్యాంకులిచ్చే మొత్తం పరపతిలో 40శాతం ప్రాధాన్యతారంగాలకు కేటాయించాలని ఆర్‌బీఐ వాణిజ్య బ్యాంకులకు నిర్దేశించింది. బ్యాంకింగ్ రంగ సంస్కరణలపై ఏర్పాటైన నరసింహం కమిటీ మాత్రం ప్రాధాన్యతారంగ పరపతిని 40 నుంచి 10 శాతానికి తగ్గించాలని సూచించింది. కానీ 1991లో ప్రభుత్వం ఈ సిఫార్సును అమలు చేయలేదు.

☞ ఈ క్రమంలో వివిధ సమయాల్లో ప్రాధాన్యతా రంగాలకిచ్చిన పరపతిని గణాంకాలతో సహా వివరిస్తూ ఆర్థికాభివృద్ధికి ఆ రంగం అందించిన తోడ్పాటును విశ్లేషించాలి. దాంతో పాటు ప్రాధాన్యతా రంగ రుణాల విషయంలో ఉత్పన్నమవుతున్న సమస్యలను కూడా పరిశీలించాలి.

**2. సంస్కరణల యుగంలో దేశంలో బ్యాంకింగ్ రంగ అభివృద్ధిని వివరించండి?**

జ. సంస్కరణల యుగంలో ప్రైవేటు, విదేశీ బ్యాంకులను అనుమతించారు. దీని వల్ల వాటికి లభించే డిపాజిట్లు అందించే పరపతి పెరిగి వివిధ రంగాల్లో అభివృద్ధి సాధ్యమయింది. మొత్తం షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల ఆస్తుల్లో.. ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా 2007-08లో 69.9 శాతానికి చేరింది. ప్రైవేటు రంగంలో అప్పటికేఉన్న బ్యాంకుల వాటా కొంత తగ్గగా విదేశీ బ్యాంకులు, కొత్తగా ఏర్పాటైన ప్రైవేటు బ్యాంకుల ఆస్తులు, మొత్తం ఆస్తుల్లో పెరిగాయి. మరో వైపు నగదు-నిల్వల నిష్పత్తి (CRR), స్టాట్యూటరీ లిక్విడ్ రేషియో (SLR)ను తగ్గించడం వల్ల బ్యాంకుల వద్ద ద్రవ్యత్వం పెరిగి.. తద్వారా ముఖ్య రంగాలకు అందించే పరపతి పెరిగింది. సంస్కరణల యుగంలో బ్యాంకులు అవసరమైన మేరకు క్యాపిటల్ అడ్వెకెన్సీ రేషియో కలిగి ఉండి తమ ఆర్థిక పరిపుష్టి పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందించగలిగాయి. బ్యాంకింగ్ రంగ అభివృద్ధికి తీసుకున్న చర్యల కారణంగా ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం భారతీయ బ్యాంకింగ్ రంగంపై కనిపించలేదు.

**3. ప్రస్తుతం ఆర్థిక వృద్ధి మందగించిన నేపథ్యంలో ఆర్‌బీఐ ద్రవ్యవిధానం ఏ విధంగా ఉండాలని భావిస్తున్నారు?**

జ. ద్రవ్య సప్లయ్ నియంత్రణకు సంబంధించి రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అవలంభించే విధానమే ద్రవ్యవి ధానం. ఆర్థిక స్థిరత్వం, పూర్ణోద్యోగిత, వినిమయ రేటు స్థిరత్వం ఆర్‌బీఐ ద్రవ్యవిధాన లక్ష్యాలు. వ్యాపారచక్రాల కాలంలో ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులకు లోనవుతుంది. ఆర్థిక వ్యవస్థ తిరోగమనం లో ఉన్నప్పుడు ద్రవ్యసప్లయ్ తగ్గి ఆర్థిక కార్యకలాపాలు కుంటు పడతాయి. ఈ స్థితిలో ఆర్‌బీఐ పరపతి పెంచడానికి పరిమాణా త్మక, గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను ఉపయోగి స్తుంది. ముఖ్యంగా పరిమాణాత్మక సాధనాలు బ్యాంకురేటు, బహిరంగమార్కెట్ చర్యలు, నగదు నిల్వల నిష్పత్తిని ఉపయో గిస్తూ ద్రవ్యసప్లయ్‌ను పెంచడానికి చర్యలు తీసు కోవడం ద్వారా ఆర్థిక కార్యకలపాల పెంపుదలకు ప్రయత్నిస్తుంది. అంతేకాకుండా కొన్ని ముఖ్య రంగాలకిచ్చే పరపతికి సంబంధించి ప్రోత్సాహకాలి వ్వడం ద్వారా ఆయా రంగాలను ప్రోత్సహిస్తుంది. ఆర్థికవృద్ధి మందగించిన సమయంలో.. ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడీలో పెట్ట డానికి పెట్టుబడులు పెరిగే విధంగా ద్రవ్యవిధానాన్ని రూపొందించాలి.

**4. సాంఘిక బ్యాంకింగ్ (Social banking) ఆవశ్యకతను భారతదేశాన్ని దృష్టిలో ఉంచుకొని వివరించండి?**

జ. సాంఘిక బ్యాంకింగ్ విధానంలో ప్రభుత్వం తాను అమలు చేసే పేదరిక, నిరుద్యోగ నిర్మూలనా కార్యక్రమాలకు అవస రమైన నిధులను అందించడానికి ప్రభుత్వ బ్యాంకులను ఉపయోగించు కుంటుంది. దేశ అభివృద్ధి వ్యూహానికి ఈ చర్య ఉపకరిస్తున్నప్పటికి మరోవైపు ప్రభుత్వరంగ బ్యాంకుల లాభదాయకత తగ్గడానికి కూడా ఈచర్య దారి తీస్తుంది. ఏప్రిల్ 1972లో వివిధ లక్షిత వర్గాల అభ్యున్నతి కోసం డిఫెరిన్షియల్ ఇంట్రెస్ట్ రేట్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దేశంలో ప్రవేశపెట్టిన సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం, మైనారిటీలకు బ్యాంకు పరపతి, ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకు పరపతి, పీఎంఆర్‌వై కింద విద్యావంతులైన నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధిలో భాగంగా ప్రవేశపెట్టిన పథకాలకు ఇచ్చిన పరపతి సకాలంలో రికవరీ కాక బ్యాంకులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాలు వల్ల ఒక వైపు బ్యాంకుల లాభదాయకత తగ్గినప్పటికి.. మరో వైపు సాంఘిక న్యాయం,సమానత్వం సాధించడంలో ప్రభుత్వం కొంత మేర సఫలీకృతమయింది. కాబట్టి భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు 'సాంఘిక బ్యాంకింగ్' అవసరం ఎంతైనా ఉంది.

**5. నరసింహం కమిటీ సిఫార్సులను విమర్శనాత్మకంగా పరిశీలించండి?**

జ. బ్యాంకింగ్ రంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలను సూచించ డానికి 1991,తిరిగి 1998లో నరసింహం కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చేసిన సిఫార్సులను చాలా వరకు దశల వారీగా అమలుచేశారు. కానీ కొన్నింటిని మేధావులు, బ్యాంకింగ్ రంగ నిపుణులు, బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిం చాయి. ముఖ్యంగా ప్రాధాన్యత రంగాలకు ఇచ్చే పరపతిని 40 నుంచి 10 శాతానికి తగ్గించడం, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ లేదా కేంద్ర బ్యాంకు వాటాను 51 నుంచి 33 శాతానికి తగ్గించ డం వంటి చర్యలు అనేక విమర్శలకు గురి అయ్యాయి. ప్రభుత్వం ఈ సిఫార్సులను అమలు చేయలేదు.

☞ ఈ క్రమంలో 1991, 1998లో ఏర్పాటయిన రెండు కమిటీల సిఫార్సులన్నింటిని పరిశీలించి వాటిని అమలు చేసిన తర్వాత బ్యాంకింగ్ రంగంలో సాధ్యమయిన అభివృద్ధి వివరిస్తూ, విమర్శ లకు గురైన సిఫార్సులను కూడా అమలు చేసినట్లయితే ఎటు వంటి పరిణామాలు చోటు చేసుకునేవో విశ్లేషించాలి.

**6. ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ కాలంలో కేంద్ర బ్యాంక్ పర పతి క్రమబద్ధీకరణ ఎలా చేపడుతుందో వివరించండి?**

జ. దేశంలో ద్రవ్య సప్లయ్‌లో పెరుగుదల ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ద్రవ్య సప్లయ్ తగ్గుదల ప్రతి ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. పరపతి క్రమబద్ధీకరణకు ఆర్‌బీఐ పరి మాణాత్మక లేదా గుణాత్మక, విచక్షణాత్మక సాధనాలను వినియోగిస్తుంది. ద్రవ్యో ల్బణ కాలంలో ద్రవ్యసప్లయ్ తగ్గించే క్రమంలో ఈ సాధనాలను ఎలా ఉపయోగిస్తుంది? ప్రతి ద్రవ్యోల్బణ కాలంలో ద్రవ్య సప్లయ్ పెంచే క్రమంలో ఈ పరపతి సాధనాలను ఎలా ఉపయోగిస్తుంది? అనే విషయాల పట్ల అవగాహన ఏర్పరచుకోవాలి.

**7. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (NBFC) నియంత్రణకు ఆర్‌బీఐ చేపట్టిన చర్యలు?**

జ. చట్టబద్ధమైన నిర్వచనంతో సంబంధం లేకుండా బ్యాంకింగ్ సేవలు అందించే ఆర్థిక సంస్థలే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు. అన్ని రకాలైన బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు పబ్లిక్ డిపాజిట్లు సేకరించరాదు. కేవలం ఋణాలు, అడ్వాన్స్‌లు ఇవ్వడం వంటి వాటినే నిర్వహించాలి. ఈ సంస్థల నియంత్రణకు ఆర్‌బీఐ కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకుంది. రిజిస్ట్రేషన్ విధానాన్ని కఠినతరం చేసిం ది. దీని వల్ల ఇటు వంటి సంస్థల సంఖ్య చాలా వరకు తగ్గింది. ఈ సంస్థలు కూడా క్యాపిటల్ అడ్వికేన్సీ రేషియో నిర్వహించాల్సి ఉండటం కూడా వీటిపై నియంత్రణలుగా భావించవచ్చు. వీటితో పాటు డిపాజిట్ల స్వీకరణ, ఋణాల మంజూరుకు సంబంధించిన అన్ని నియంత్రణ చర్యల పట్ల అవగాహన పెంచుకోవాలి.

## ముఖ్యాంశాలు

- బ్యాంకింగ్ రంగ సంస్కరణలపై ఏర్పాటైన నరసింహం కమిటీ మాత్రం ప్రాధాన్యతారంగ పరపతిని 40 నుంచి 10 శాతానికి తగ్గించాలని సూచించింది.
- ఆర్థిక స్థిరత్వం, పూర్ణోద్యోగిత, వినిమయ రేటు స్థిరత్వం ఆర్‌బీఐ ద్రవ్యవిధాన లక్ష్యాలు.
- ఏప్రిల్ 1972లో వివిధ లక్షిత వర్గాల అభ్యున్నతి కోసం డిఫెరెన్షియల్ ఇంట్రెస్ట్ రేట్ విధానాన్ని ప్రవేశపెట్టారు.
- బ్యాంకింగ్ రంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలను సూచించడానికి 1991,తిరిగి 1998లో నరసింహం కమిటీ ఏర్పాటు చేశారు.
- దేశంలో ద్రవ్య సప్లయ్‌లో పెరుగుదల ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ద్రవ్య సప్లయ్ తగ్గుదల ప్రతి ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది.